బుద్ధారం చెరువును నుంచి అక్రమంగా మట్టి తరలింపు

- అడ్డుకున్న గ్రామస్తులు.. గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

మట్టిని తరలింపును అడ్డుకున్న మాజీ జడ్పీటీసీ లింగస్వామి, గ్రామస్తులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 23 : చిట్యాల ఎక్స్ రోడ్డు నుంచి నల్లగొండ మండలంలోని కంచనపల్లి ఎక్స్ రోడ్డు వరకు జరుగుతున్న డబుల్ రోడ్డు పనులకు మండలంలోని బుద్దారం పడమటి చెరువు నుంచి అనుమతుల లేకుండా చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని బుద్దారం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు సోమవారం గ్రామస్తులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు వెళ్లి మట్టి తరలింపును అడ్డుకున్నారు. అక్కడి నుంచి నేరుగా కలెక్టరేట్‌లో జరుగుతున్న గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నల్లగొండ మాజీ జడ్పీటీసీ తుమ్మల లింగస్వామి మాట్లాడుతూ రోడ్డు కాంట్రాక్టర్ అనుమతులు లేకుండా దాదాపు 20 ఫీట్ల లోతులో మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నట్లు తెలిపారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెప్పారు. అక్రమ మట్టిని తరలిస్తున్న సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీటీసీ పొగాకు ఆండాలు ఘట్టయ్య, దేవరంపల్లి చెల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిలుక ఎల్లయ్య ముత్యం రెడ్డి, లతీఫ్, మున్న, యాదయ్య, మురళీధర్‌రెడ్డి, సుధాకర్, రామలింగం తదితరులు ఉన్నారు.

తాసీల్దార్ కార్యాలయంలోనే కల్యాణలక్ష్మి దరఖాస్తులు

- ఎమ్మెల్యే వేముల వీరేశం

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, డిసెంబర్ 23 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కోసం తాసీల్దార కార్యాలయంలోనే దరఖాస్తులు చేసుకోవచ్చని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నకిరేకల్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం 83 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఆడబిడ్డలకు భరోసాగా కల్యాణలక్ష్మి ఉపయోగపడుతుందన్నారు. సంక్రాంతి లోపు రైతు భరోసా ఇస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణికృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజులామాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్ రావు, డీటీ యశ్వంత్, ఆర్ఐ ధనావత్ చిరంజీవి, సీనియర్ అసిస్టెంట్‌లు రాజ్యలక్ష్మి, ప్రవీణ్, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకటేశ్వర్లు, నకిరేకంటి ఏసుపాదం పాల్గొన్నారు.

రైతుల భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

- ఎమ్మెల్యే బాలూనాయక్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట, డిసెంబర్ 23 : రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి తీసుకొచ్చిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా రైతు సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కంబాలపల్లిలోని రైతు వేదికలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ రైతుల ఇక నుంచి భూ సమస్యలు ఉంటే కలెక్టర్ స్థాయిలో వెళ్లాల్సిన పని లేదని, ఆర్డీఓ, తాసీల్దార్ స్థాయిలోనే పరిష్కరించుకునేలా భూ భారతి రూపకల్పన చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతు సేవా ఫౌండేషన్ చైర్మన్ సునిల్ కుమార్, ఫౌండేషన్ ప్రెసిడెంట్ లచ్చిరెడ్డి, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జమునామాధవరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, నాయకులు ముత్యాలసర్వయ్య, గోవిందుయాదవ్, బిక్కునాయక్, వేణుధర్‌రెడ్డి, బుజ్జి లచ్చిరాంనాయక్, సిరాజ్‌ఖాన్, ముక్కమల వెంకటయ్యాగౌడ్, హరికృష్ణ, కొర్ర రాంసింగ్‌నాయక్, తాసీల్దార్ శ్రీనివాస్, ఏఓ లక్పతి, సత్యనారాయణ, పరమేశ్‌యాదవ్, చంద్రశేఖర్, మాధవచారి, బద్యా నాయక్, సాధిక్ పాల్గొన్నారు.

నేపాల్ సదస్సులో ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ప్రతిభ

ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌ను అభినందిస్తున్న వీసీ హుస్సేన్

రామగిరి, డిసెంబర్ 23 : నేపాల్‌లోని ఖాట్మండ్‌లో గల త్రిబుల్ వన్ యూనివర్సిటీలో ఈ నెల 13 నుంచి 20 వరకు జరిగిన జాతీయ సదస్సులో ఎంజీయూ గణితం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.ఉపేందర్ రెడ్డి, పి.మద్దిలేటి హాజరయ్యారు. సదస్సులో పరిశోధన పత్రాలు సమర్పించి ప్రతిభ చూపినందుకుగానూ సర్టిఫికెట్లు అందజేశారు. దీనిలో భాగంగా సోమవారం ఎంజీయూలో వారు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ కలిశారు. వీసీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రిజిస్ట్రార్ అల్వాల రవితోపాటు సహచార అధ్యాపకులు కూడా అభినందనలు చెప్పారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి : డీఎస్పీ

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబర్ 23 : మండలంలో పోలీసు సిబ్బంది నేరాల నియంత్రణకు కృషి చేయాలని డీఎస్పీ గిరిబాబు అన్నారు. గుడిపల్లి పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులు, పరిసరాల పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం నూతనంగా వచ్చిన పోలీసు సిబ్బందికి సలహాలు సూచనలు అందజేశారు. ఈయన వెంట సీఐ ధనుంజయ్, ఎస్ఐ నర్సింహులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రాఘవ ఎంపిక

త్రిపురారం, డిసెంబర్ 23 : సీఎం కప్ గ్రామీణ క్రీడోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని పెద్దదేవులపల్లి జిల్లా పరిషత ఉన్నత పాఠశాల విద్యార్థి బి.రాఘవ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. రాఘవను ఎంఈఓ రవినాయక్, పీడీ అంజయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

28 నుంచి 31వరకు ఏపీజీవీబీ సేవలకు బ్రేక్

శాలిగౌరారం డిసెంబర్ 23 : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకును జనవరి 1నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారుస్తున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంకింగ్ సేవలు నిలిపివేస్తున్నట్లు శాలిగౌరారం ఏపీజీవీబీ మేనేజర్ ముడావత్ జామ్లా తెలిపారు. ఈ నెల 27లోపు బ్యాంకింగ్ అవసరాలను పూర్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో క్యాషియర్ కోటేశ్వరావు, మెసెంజర్ రామనర్సయ్య, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను
ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 24 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి.
NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలి

- బీసీ కమిషనర్ బాలామాయాదేవి

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న బాలామాయాదేవి, పక్కన కలెక్టర్ త్రిపాఠి

నల్లగొండ, డిసెంబర్23 : జనవరి1, 2025 ఆధారంగా తయారు చేస్తున్న ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా తప్పులు లేని ఓటర్ జాబితాను రూపొందించాలని జిల్లా ఓటర్ జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమిషనర్ బి.బాల మాయాదేవి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఓటర్ జాబితాపై సమీక్షించారు. ఈ సందర్భంగా బాల మాయాదేవి మాట్లాడుతూ ఓటర్ జాబితా ప్రత్యేక సవరణపై నిర్వహించే సమావేశాలన్నింటినీ వెబ్‌సైట్‌లో ఉంచాలన్నారు. ఫొటో, ఓటరు గుర్తింపుకార్డులు చాలా ముఖ్యమని, కార్డు నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని, కార్డుల్లో ఒకరి ఫొటో బదులు ఇంకొకరి ఫొటో రాకుండా జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జనవరి 6, 2025న తుది ఓటర్ జాబితా ప్రచురించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ జాబితా ప్రకారం జిల్లాలో 7,40,971మంది పురుష ఓటర్లు, 7,61,105మంది మహిళా ఓటర్లు, 127మంది ట్రాన్స్‌జెండర్లు మొత్తం 15,02,203మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

వసతి గృహాల్లో మెనూను తప్పనిసరిగా అమలు చేయాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని బీసీ సంక్షేమ హాస్టళ్లలో మెనూ తప్పకుండా అమలు చేయడంతోపాటు వసతి గృహాలు శుభ్రంగా ఉంచాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలా మాయాదేవి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని బాలుర, బాలికల వసతి గృహాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులను, డైనింగ్, స్టోర్ రూమ్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్, డీఆర్ఓ అమరేందర్, ఆర్డీఓలు రమణారెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఖాజానజీంఅలీ, తాసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొనారు.

28న నల్లగొండ మున్సిపల్ సాధారణ సమావేశం

నీలగిరి, డిసెంబర్ 23 : నల్లగొండ మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈ నెల 28న మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు సకాలంలో, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నల్లగొండ సిటీ, డిసెంబర్ 23 : నల్లగొండ డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సలహాలు, సూచనలకు 9959226305 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

మిర్యాలగూడ డిపోలో..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ రామ్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రయాణికులు సమస్యలు, సలహాలు, సూచనలను 9959226308 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేశ్

చిట్యాల, డిసెంబర్ 23 : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు చిట్యాలకు చెందిన మారగోని రమేశ్ గౌడ్ తెలిపారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో జరిగిన సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ మేరకు నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కట్టంగూర్, డిసెంబర్ 23 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అయిటిపాముల గ్రామంలో సోమవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం ఇటుకుల పహాడ్ గ్రామానికి చెందిన గోపాసి భిక్షం(59)ఈ నెల 22న అయిటిపాముల గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి సోమవారం స్వగ్రామం వెళ్లేందుకు బస్టాప్ వద్దకు వెళ్తున్న క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన భిక్షం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సైదులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు దర్వేశిపురం ఆలయం వద్ద షాపులకు టెండరు

నల్లగొండ సిటీ, డిసెంబర్ 23 : కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద పలు షాపులకు మంగళవారం టెండరు కం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జయరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 సంవత్సరానికిగానూ ఏడాది పాటు కొబ్బరి కాయలు, కిరాణ మిఠాయి, గాజులు తదితర వాటికి ఉదయం 11 గంటలకు టెండరు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

మిర్యాలగూడ, డిసెంబర్ 23 : పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన దాసరి స్వప్న పూరి గుడిసె ఇటీవల విద్యుదాఘాతంతో కాలిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు హనుమంతరెడ్డి శనివారం బాధిత కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బాషిపాక శివశంకర్, బీజేపీ జనరల్ సెక్రటరీ శివ, రాజురెడ్డి, కంచుకొమ్ముల వేణు, సైదులు ఉన్నారు.

జనవరి 6నుంచి ఎంజీయూలో తెలుగు అంశాలపై శిక్షణ

రామగిరి, డిసెంబర్ 23 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో జనవరి 6నుంచి 11 వరకు తెలుగులో పరీక్ష అండ్ మూల్యాంకనం చేసే విధానంపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, డిసెంబర్ 23 : పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించి, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం పలువురు బాధితుల నుంచి వినతులను స్వీకరించిన అనంతరం ఆమె పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా చూసుకోవాలని, నవజాత శిశు కేసులను ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నిలోఫర్‌కు పంపించే సమయంలో ఆలస్యం జరుగకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల జిల్లాకు 108అంబులెన్స్‌లను మంజూరు చేసినందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సబ్ సెంటర్లలో కవల పిల్లల ప్రసవాలు నిర్వహించవద్దని, ప్రభుత్వ ప్రధాన దవాఖానలు లేదా వేరే దవాఖానలకు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్ఓ అమరేందర్, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మిర్యాలగూడ, డిసెంబర్ 23 : తమకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని సోమవారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఎండీ సయిద్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు వంటలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, వెంకటమ్మ, నాగలక్ష్మి, గౌస్య, ధనమ్మ, జ్యోతి, అంజమ్మ పాల్గొన్నారు.

నేరేడ వాసికి పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డు

యాదగిరికి పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

రామగిరి, డిసెంబర్ 23 : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) జాతీయ అవార్డు చిట్యాల మండలం నేరడ వాసి యాదగిరికి దక్కింది. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సుదీర్ఘకాలంగా విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తూ ఎంతో మందిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దినందుకుగానూ ఆ సంస్థ అధ్యక్షుడు అజిత్ పాఠక్, కార్యదర్శి పీఎల్‌కే మూర్తి చేతుల మీదుగా సోమవారం హైదరాబాద్‌లో అవార్డు అందచేశారు. దీంతో యాదగిరికి బీఆర్ఏఓ డీన్ వడ్డాణం శ్రీనివాసరావుతో పాటు ప్రజా సంబంధాల నిపుణులు, జర్నలిజం శాఖ ఆచార్యులు, పరిశోధనకులు, యాదగిరికి పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు మిత్రులు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు టైం స్కూల్ విద్యార్థి

సముక్తను అభినందిస్తున్న టీచర్లు

హాలియా, డిసెంబర్ 23 : జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు టైమ్‌స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కత్తి కోటిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో ఛత్తీసగఢ్ రాష్ట్రంలోని కోర్బ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సముక్త పాల్గొననున్నట్లు ఆయన చెప్పారు. ఈ నెల 8,9,10 తేదీల్లో నిర్మల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలో సముక్త ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సముక్తను పాఠశాల డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, మంద నరేందర్ రెడ్డి, పీఈటీలు అభినందించారు.

'ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి'

తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చండూరు, డిసెంబర్ 23 : అక్రమంగా ప్రభుత్వ భూమిని అక్రమించుకున్న వారిపై చర్య తీసుకోవాని చండూరు బీజేపీ మండలాధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు అన్నారు. బంగారిగడ్డ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని రక్షించాలని సోమవారం బీజేపీ మండల శాఖ అధ్వర్యంలో ఆర్‌డీఓ, తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 2007వ సంవత్సరం బంగారిగడ్డ గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదల కోసం సర్వే నంబర్ 24లో ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి వారికి పట్టాలు పంపిణీ చేసిందని అన్నారు. ఇప్పుడు ఎలాంటి అనుమతులు లేకుండా పుట్ట కన్నయ్య అనే వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించి, దానిలో చర్చిని నడిపిస్తున్నారని తెలిపారు. కన్నయ్యపై కఠిక చర్యలు తీసుకొని, ఆ భూమిని పట్టా దారులకు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా నాయకులు కోమటి వీరేశం, మండల నాయకులు భూతరాజు శ్రీహరి, పెన్నింటి నరేందర్‌రెడ్డి, నకిరెకంటి లింగస్వామి, నలపరాజు యాదగిరి, మాదగోని నాగార్జున పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న రుణమాఫీని విడుదల చేయాలి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నన్నూరి


తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తిప్పర్తి, డిసెంబర్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ, రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నన్నూరి వెంకట్‌రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం తాసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొన్ని లోపాల వల్ల రుణమాఫీ కానివి పరిశీలించి అందరికీ వర్తించేటట్టు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేని ఎడల రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మన్నెం భిక్షం, సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేశ్, మంత్రాల మంగమ్మ, మైల సైదులు, కొట్ల గోవర్ధన్‌రెడ్డి, అంజయ్య, ప్రతాప్‌రెడ్డి, శరత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

- జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గౌస్

సీసీఐ కొనుగోలు కేంద్రంలో తనిఖీ చేస్తున్న గౌస్

కొండమల్లేపల్లి, డిసెంబర్ 23 : సీసీఐ కేంద్రాలకు పత్తి తీసుకొచ్చే రైతులను ఇబ్బందులకు గురుచేయొద్దని జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గౌస్ అన్నారు. పత్తి రైతుల సౌకర్యార్థం సీసీఐ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తిని కోనుగోలు చేసే క్రమంలో తేమ, తూకం తదితర అంశాల్లో సిబ్బంది పాటిస్తున్న నిబంధనల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్రం నిర్వాహకులు రైతులకు ఇచ్చే తఖ్ పట్టీలను పరిశీలించారు. అయన వెంట ఎంపీడీఓ ఇందిర, ఏఈఈ రాఘవేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అధికారులు

మిర్యాలగూడ, డిసెంబర్ 23 : పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పోలీసులు, మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలో సోమవారం ట్రాఫిక్ నియంత్రణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే వ్యాపరపరంగా పేరుగాంచిన మిర్యాలగూడలో ప్రధానంగా సాగర్ రోడ్డు ఒక్కటే ఉండడం వల్ల నిత్యం లక్షలాది మంది ప్రజలు, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుందన్నారు. ఆయా షోరూంలు, కార్యాలయాలు, బ్యాంకుల వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారని, దాంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్, సీఐలు కరుణాకర్, సైదిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి బాలు, జలంధర్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, పొదిల శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, జాని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి ఆటో డ్రైవర్ హల్‌చల్

సెల్‌టవర్ ఎక్కిన చిలుముల చింతాలు

కట్టంగూర్, డిసెంబర్ 23 : తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఆవేదనకు గురైన ఓ ఆటో డ్రైవర్ సెల్ టవర్ ఎక్కి రెండు గంటల సేపు హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన సోమవారం నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామశివారులో చోటు చేసుకొంది. మండలంలోని చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన చిలుముల చింతాలు వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. నాలుగు రోజుల క్రితం తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని నకిరేకల్ వెళ్తుండగా పట్టణంలో కొంత మంది వ్యక్తులు రాంగ్ రూట్‌లో వచ్చి చింతాలుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అదే రోజు దాడి చేసిన వారిపై చింతాలు నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజులైనా దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో మనస్థాపానికి గురై అయిటిపాముల గ్రామశివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. విషయం తెలుసుకున్న కట్టంగూర్ ఎస్ఐ రవీందర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేయగా, న్యాయం చేసే వరకూ దిగనని మొండిగా ప్రవర్తించాడు. దుర్గాప్రసాద్ అనే కానిస్టేబుల్ టవర్‌పై ఉన్న చింతాలుతో సమయ స్ఫూర్తిగా మాట్లాడుతూ న్యాయం చేస్తామని నచ్చజెప్పడంతో కిందికి దిగాడు. దీంతో పోలీస్ సిబ్బంది, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. చింతాలును నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మునుగోడు, డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో 2001-2003 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్వో పోస్టులు నేరుగా నియామకం చేయాలని వినతి

నల్లగొండ, డిసెంబర్ 23: రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ గ్రామీణ స్థాయిలో వీఆర్వో వ్యవస్థను తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నందున ఆ పోస్టులను పాత వారితో కాకుండా నూతనంగా నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలని నిరుద్యోగులు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వీఆర్వోగా పనిచేసిన వారిని గత ప్రభుత్వం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసినందున, కొత్తగా నియమించే వారిని నోటిఫికేషన్ వేసి నియమిస్తే రాష్ట్రంలో మరో 12వేల మందికి ఉద్యోగం కల్పించినట్లవుతుందని తెలిపారు. పాత వారినే తీసుకొస్తే మళ్లీ అవినీతి జరిగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో షేక్ మహ్మద్, కిషన్ తదితరులు ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

నీలగిరి, డిసెంబర్23 : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై బీజేపీ అగ్రనాయకుడు అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ సెంటర్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో కులాలను, మతాలను రెచ్చగొడుతున్నదని విమర్శించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హన్యానాయక్‌కు ఐకాన్ స్టార్ 2024 అవార్డు

ఐకాన్ స్టార్ అవార్డు అందుకుంటున్న హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, డిసెంబర్ 23 : పట్టణానికి చెందిన ఫెయిత్ బంజారా అనాథాశ్రమ నిర్వాహకుడు హన్యానాయక్‌కు ఐకాన్ స్టార్ 2024 అవార్డు వరించింది. న్యూఢిల్లీలోని సిద్ధార్థ హోటల్‌లో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. కొన్ని సంవత్సరాలుగా పేదలకు ఉచిత విద్య, వైద్యం, సామాజిక సేవ చేస్తున్నందుకుగానూ ఈ అవార్డు దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపిక చేసిన ఎస్ఎంఈ బిజ్ సంస్థ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

తప్పిపోయిన బాలుడిని అప్పగించిన యువకులు

బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు, యువకులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 23 : నల్లగొంలోని శివాజీనగర్‌లో సోమవారం ఓ బాలుడు తప్పిపోగా స్థానిక యువకులు గుర్తించి పోలీసుల సమక్షంలో తండ్రికి అప్పగించారు. వివరాలు.. చర్లపల్లికి చెందిన సంపత్ తన కుమారుడు కీమాన్ష్‌తో కలిసి శివాజీ నగర్‌లో ఓ దుకాణానికి వెళ్లాడు. సంపత్ దుకాణంలో కొనుగోళ్లు జరుపుతుండగా కీమాన్ష్‌ను గమనించలేదు. ఈ లోగా అక్కడక్కడే తిరుగుతున్న బాలుడు ఒక్కసారిగా ఎటో వెళ్లిపోయాడు. తరువాత కుమారుడి కోసం చూసిన సంపత్‌కు, కీమాన్ష్ కనపడకపోవడంతో చుట్టుపక్కల వాళ్లను అడగ్గా ఎవరూ చూడలేదని చెప్పారు. దీంతో కంగారుగా బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేసి అడిగినా తెలియదని చెప్పడంతో పోలీసులను ఆశ్రయించాలని అనుకున్నాడు. ఈ లోగా చర్లపల్లికి చెందిన కొందరు యువకులు శివాజీనగర్ వీధుల్లో తిరుగుతున్న బాలుడిని గమనించి తీసుకెళ్లి టూటౌన్ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. బాలుడు వాళ్ల నాన్న పేరు చెప్పడంతో తెలిసిన వాళ్ల ద్వారా సంపత్‌ను స్టేషన్‌కు పిలిపించి బాలుడిని అప్పగించారు. బాలుడిని అప్పగించిన 15వ వార్డు కౌన్సిలర్ ఏర్పుల రవి, నాగెల్లి సాయి, ఇస్రం గణేశ్‌ను పోలీసులు, బాలుడి తండ్రి ధన్యావాదాలు తెలిపారు.